క్లుప్తంగా

వన్యప్రాణులను సంరక్షించాలి

సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ వన్యప్రాణులను సంరక్షించాలని సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ పి.స్నేహలత కోరారు. సత్తుపల్లిలో శనివారం సాయంత్రం వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలలో భాగంగా మైనార్టీ పాఠశాల విద్యార్థులతో కలిసి అటవీశాఖ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఎస్ఓలు నర్సింహారావు, మదన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముదిగొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎల్ఓ డాక్టర్ ప్రవీణ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిజిస్టర్లను పరిశీలించిన ఆమె కుష్ఠువ్యాధి సర్వే, ఎయిడ్స్ స్క్రీనింగ్ పరీక్షలపై సూచనలు చేశారు. డీపీఎంఓ సంధ్య, వైద్యాధికారి అరుణాదేవితోపాటు ఉద్యోగులు దుర్గామల్లేశ్వరి, లత, సరోజిని, నాగమణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



అరవింద్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

వైరా: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థి వి.అరవింద్‌కుమార్ ఎంపికయ్యాడని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ తెలిపారు. ఇటీవల కల్లూరులో జరిగిన ఎంపిక పోటీల్లో అండర్‌-17 విభాగం నుంచి అరవింద్ ప్రతిభ కనబర్చగా రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

ముదిగొండ: మండలంలోని ఖానాపురంలో చేపల పెంపకంపై ఐసీఏఆర్, సీఐఎఫ్ఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఎస్సీ లబ్ధిదారులకు చేపపిల్లలు, వలలు, చేపలమేత, ట్రేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ ఆంజనేయస్వామి, శాస్త్రవేత్తలు డాక్టర్‌లు రమేష్‌రాథోడ్, సూర్యచంద్రం, వీపీ రంగాచార్యులు, శేషగిరి, ఎఫ్‌సీఓ పోకల మురళిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మధిరరూరల్: యువతీ యువకుల నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభమై పాత కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లవరం గ్రామంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎస్‌కే సైదులు, వినయ్, గోపి, అజయ్, నరేష్, లక్ష్మణ్, ప్రవీణ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సమావేశం

ముదిగొండ: స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో శనివారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ రామారావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలని అన్నారు. సమావేశంలో డీటీ డేవిడ్ కరుణాకర్, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని చినమండవ మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో పందిళ్లపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఎవరైనా అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో మట్టి తోలకం విషయంలో తలెత్తిన ఘర్షణలో అనంత సైదులుకు గాయాలైన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై శనివారం అనంత సైదులు, పి.లక్ష్మీనారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

సారా విక్రేతపై..

కారేపల్లి: సారా విక్రేతపై కారేపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగారంతండా గ్రామానికి చెందిన భూక్యా రంగి నాటు సారా తయారు చేస్తు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు.. ఎస్సై పుష్పాల రామారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని దాడులు నిర్వహించి డ్రమ్ములో ఉన్న 50 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి, 3 లీటర్ల నాటు సారాను స్వాధీన పర్చుకున్నారు. అనంతరం బాధితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్.. @ మధిరరూరల్

- కేసుల పరిష్కారంలో ముందంజ
- జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఏడుసార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

సండే స్పెషల్



మధిర రూరల్ పోలీస్ స్టేషన్ (ఇన్‌సెట్) ముఖద్వారం

మధిర: పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులను పరిష్కరించడం, పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, గార్డెనింగ్ తదితర అంశాల్లో తెలంగాణ రాష్ట్రంలోనే మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ బెస్ట్ స్టేషన్‌గా ఎంపికైంది. స్త్రీలపై జరిగిన నేరాలు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులు, చోరీల కేసుల్లో ఆస్తి రికవరీ, మిస్సింగ్ కేసులను చేదించడం, వ్యక్తి ఆచూకీ కనుగొనే కేసులు, గుర్తుతెలియని మృతదేహాల కేసుల్లో వారి వివరాలు తెలుసుకోవడం వంటి అంశాలను పరిశీలిస్తారు.

రాష్ట్రంలో ప్రథమ స్థానంలో..

మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 750 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రతి నెల ఆరు అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులు, వాటిలో ఎన్ని పరిష్కరించారనే వివరాలను సేకరిస్తారు. ఈ అంశాలకు సంబంధించి 60 మార్కులు ఉంటాయి. కేసుల్లో పురోగతి సాధించి 60 రోజుల్లో కేసు పూర్వపరాలు తెలుసుకొని ఆ కేసులను పరిష్కరించడానికి మార్కులను కేటాయిస్తారు. ఈ విధంగా మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌కి 48.67 మార్కులు వచ్చాయి. దీంతో రాష్ట్రంలోనే బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా ఎంపికై ప్రథమ స్థానంలో నిలిచింది.

ఆగస్టు నెలలో 26వ ర్యాంకుతో..

మొత్తం పోలీస్ స్టేషన్లలోని 30 పోలీస్ స్టేషన్లను పరిగణనలోకి తీసుకొని, వాటిలో ప్రాధాన్యత క్రమంలో మార్కులు కేటాయించి ప్రతినెల జాబితాను తయారు చేస్తారు. ఈ జాబితాలో ఖమ్మం జిల్లా మధిరరూరల్ పోలీస్‌స్టేషన్ జనవరి నుంచి సెప్టెంబర్ నెల వరకు మొత్తం 9 నెలలకు 7సార్లు ఇప్పటికీ బెస్ట్ ర్యాంకు సాధించింది. జూలై నెలలో 20వ ర్యాంకులో ఉండగా, ఆగస్టు నెలలో 26వ ర్యాంకుకు దిగజారింది. ఈ క్రమంలో మధిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాటోత్ వసంత్ కుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రఫీ ఆధ్వర్యంలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించారు.

భవన నిర్మాణ వివరాలిలా..

గతంలో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్, మధిర పట్టణంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. రూరల్ పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక భవనం నిర్మించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ ఆదేశాల మేరకు నాటి మధిర సీఐ మురళి ఖాజీపురం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కృషి చేశారు. సుమారు 15 అడుగుల లోతులో ఉన్న గుంతను వందలాది ట్రక్కుల మట్టితో నింపి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణంతో పాటు సిబ్బందికి విశ్రాంతి గది, పార్కింగ్‌కు రేకుల షెడ్డు, గార్డెనింగ్ చేసి అందంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన వసంత్ కుమార్ ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కేసుల పూర్వపరాలు తెలుసుకొని వాటిని చేధించడంలో సఫలీకృతమయ్యారు. దీంతో జనవరి నుంచి ఇప్పటివరకు 7సార్లు రాష్ట్రంలోనే మధిర రూరల్ పోలీస్ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. పోలీస్ స్టేషన్ నిర్వహణతో పాటు వివిధ కేసుల్లో ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సిటిజన్స్ ఫీడ్ బ్యాక్ కూడా పరిశీలించి రాష్ట్ర డీజీపీ కార్యాలయం ఈ ర్యాంకులను కేటాయిస్తుంది. కేసులకు సంబంధించిన ఫైళ్లను అధునాతన ఫర్నిచర్‌లో భద్రపరిచారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత కలిగి ఉండడంతో పాటు ఆహ్లాదకరంగా ఉంటుంది.



భద్రపరిచిన రికార్డులు



విధి నిర్వహణలో ఎస్ఐ రఫీ

పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు..



ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ ఆదేశాల మేరకు కేసులపై ఫోకస్ పెట్టి కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. ప్రజలకు శాంతిభద్రతలతో పాటు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు బెస్ట్ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక అయ్యేందుకు కృషి చేసిన ఎస్సైతో పాటు సిబ్బందిని కూడా అభినందించడం జరిగింది.

– జె.వసంత్ కుమార్, మధిర సీఐ

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం



చౌడవరంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: అన్ని వార్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఏది కావాలన్న చేస్తూ నా వంతు భాధ్యత నేను నిర్వర్తించానని.. ఇప్పుడు గెలుపు బాధ్యత మీదేనని ఆయన అన్నారు. దళితబంధుపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని.. నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి అందిస్తామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి 9 ఏళ్లలో కేసీఆర్ చేశారన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, మందపాటి మహేశ్వర రెడ్డి, దొడ్డ చెన్నకేశవరెడ్డి, పుచ్చాకాయ శంకర్‌రెడ్డి, హరిబాబు, గాయం రాంబాబు, మూడు రాందాసు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సండ్రకు గ్రామస్తుల మద్దతు..



ప్రతిజ్ఞ చేస్తున్న తూర్పులోకవరం గ్రామస్తులు

కల్లూరురూరల్: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు తూర్పు లోకవరం గ్రామస్తుల మద్దతు ఇస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం సర్పంచ్ తడికమళ్ల నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో.. కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్వరరావు, నారాయణరావు, సామేలు సమక్షంలో గ్రామస్తులు సమావేశమై ఎమ్మెల్యే సండ్రను గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మంపాటి మోహన్‌రావు, బ్రహ్మయ్య శ్రీనివాసరావు, నర్సింహారావు, రాజేష్, వార్డు సభ్యులు రామారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండలంలో దళితబంధు సర్వే

తల్లాడ: మండలంలో దళితబంధు సర్వే ముమ్మరంగా జరుగుతోంది. శనివారం అన్నారుగూడెం, బిల్లుపాడు, గొల్లగూడెం గ్రామంలో ప్రత్యేకాధికారి జిల్లా పౌర సరఫరాల అధికారి గంటా శ్రీలత సర్వే చేశారు. మల్లారం, మిట్టపల్లి గ్రామాల్లో చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, ముద్దునూరు, నూతనకల్, పినపాక, రామానుజవరం, రంగంబంజర, రేజర్ల గ్రామాల్లో జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి సర్వే నిర్వహిచారు. ఆధార్, రేషన్‌కార్డ్, కులం, ఆధాయ ధృవీకరణ పత్రాలను పరిశీలించారు.



బిల్లుపాడులో సర్వే చేస్తున్న గంటా శ్రీలత

కొనసాగుతున్న దళితబంధు సర్వే..

కల్లూరు రూరల్: మండలంలో దళితబంధు సర్వే రెండోవరోజు ప్రారంభమైంది. శనివారం ఇంటింటికీ, దళిత వాడల్లో ప్రభుత్వ అధికారులు సమగ్ర సర్వే చేస్తున్నారు. మండలంలో ఆర్డీఓ అశోక్ చక్రవర్తి పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీరవెల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త జెస్సీ సునీత

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫీల్డు విజిట్‌లో భాగంగా పల్లిపాడు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురించి వివరించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జెస్సీ సునీత.. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజాత, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పట్టాల పంపిణీలో గందరగోళం



కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

కారేపల్లి: గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేరు లేకపోవడంతో అర్జీదార్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనర్హులకు కేటాయించారని ఆందోళన చేయడంతో పట్టాల పంపిణీ గందరగోళంగా మారింది. దీంతో కారేపల్లి భరత్‌నగర్‌కు చెందిన రాంబాబు గత 20ఏళ్లుగా కుటుంబంతో గుడిసెలో ఉంటున్నానని, తులిస్యా తండాకు చెందిన వెంకటేశ్వర్లు సైతం మలాంటి పేదోళ్లకి గృహలక్ష్మి ఇవ్వారా అంటూ.. ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇదిలా ఉండగా.. మాణిక్యారం ఎంపీటీసీ సభ్యురాలు శివరాత్రి పార్వతి సభలో తహసీల్దార్ సురేష్ కుమార్ మాట్లాడుతుండగా.. అడ్డుకొని గృహలక్ష్మి అర్హులకు ఇవ్వకుండా, అనర్హులకు ఎందుకిచ్చారని ఆమె నిలదీశారు. దీంతో అధికారులు.. రీసర్వే చేసి అర్హులకు గృహలక్ష్మి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో.. ఆందోళన సద్దుమణిగింది.

విద్యార్థులకు సన్మానం

తల్లాడ: మండలంలోని మల్సూర్‌తండా గ్రామానికి చెందిన గిరిపుత్రుడు భూక్యా గోపి నాయక్, తల్లాడకు చెందిన గంజాయి ఉపేంద్ర ఇటీవల వెలువడిన ఫలితాల్లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. శనివారం ఉపేంద్రను గ్రామస్తులు అభినందించగా.. మల్సూరుతండాలోని గోపిని హెల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో.. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణ నాయక్, మండల అధ్యక్షుడు రవినాయక్, నందా నాయక్, రామక్రిష్ణ నాయక్, సక్రియ నాయక్, బిక్కు నాయక్, రామారావు నాయక్ పాల్గొన్నారు.

ఆడపడుచులకు కానుకగా చీరలు

కారేపల్లి/తల్లాడ/చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ కానుకగా అందిస్తున్న చీరలను ఆడపడుచులందరూ పొందాలని సింగరేణి, తల్లాడ ఎంపీపీలు మాలోత్ శకుంతల, దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కుటుంబరావు, శ్రీనివాసరావులు తెలిపారు. కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో, తల్లాడలోని అన్నారుగూడెం, నూతనకల్ గ్రామాల్లో, చింతకానిలోని రామకృష్ణాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో మహిళలకు శనివారం బతుకమ్మ చీరలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులు ఇంటింటా ఎంతో సంతోషంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను అందిస్తున్నారని తెలిపారు. అదే విధంగా కారేపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. ఈ కార్యక్రమాలల్లో తహసీల్దార్లు, రవికుమార్, సురేష్ కుమార్, ఎంఈఓ దామోదరప్రసాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్‌నాయక్, ఎంపీఓ చెరుకుమళ్ల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆదెర్ల స్రవంతి, ఎంపీటీసీ సభ్యురాలు ఇమ్మడి రమాదేవి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ: అన్నారుగూడెంలో.. చీరలు అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తమ్మినేని నివాళి

ముదిగొండ: ముదిగొండలో ఇటీవల కట్టకూరి వెంకయ్య మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం పరామర్శించి.. వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం సీనియర్ నాయకుడు వేగినాటి నాగేశ్వరరావు(55) మృతదేహాన్ని తమ్మినేని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమేష్, జిల్లా నాయకుడు వరప్రసాద్, మండల కార్యదర్శి పురుషోత్తం, వైస్ఎంపీపీ దామోదర్, ఐద్వా మండలాధ్యక్షురాలు పద్మ, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

చింతకాని: అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో రూ.లక్ష చెక్కులను కమల్‌రాజ్.. చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాలకు చెందిన బీసీ, కుల, చేతి వృత్తి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రజలు పథకాలను వినియోగించుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, చింతకాని, ముదిగొండ జెడ్పీటీసీ సభ్యులు పర్చగాని తిరుపతి కిషోర్, పసుపులేటి దుర్గ, ఎంపీపీలు కోపూరి పూర్ణయ్య, సామినేని హరిప్రసాద్, చింతకాని వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్, మండల కన్వీనర్ పానుగోటి రత్నాకర్, చింతకాని ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, వాచేపల్లి లక్ష్మారెడ్డి, చేబ్రోలు మల్లికార్జున్, గ్రామసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు

బీఆర్ఎస్ పార్టీలో చేరిక..

బోనకల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం వివిధ పార్టీల నుంచి 100 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో మధిర గడ్డపై గులాబీజెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మదిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, మండలాధ్యక్షుడు చేబ్రోలు మల్లిఖార్జున్, కరివేద సుధాకర్, తమ్మారపు బ్రహ్మయ్య, కాకాని శ్రీను, వేమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి వివిధ వార్డుల్లో దళితబంధు పథకాన్ని అధికార పార్టీ నాయకులకే వర్తింపచేస్తున్నారని పలువురు ఆరోపించారు. ఈమేరకు అర్హులందరికీ వర్తింపచేయాలనే డిమాండ్‌తో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వైరా నియోజకవర్గంలో అర్హులందరికీ దళిత బంధు, గృహలక్ష్మి పథకాలు వర్తింపచేస్తామని తెలిపారు.

పథకాల అమలులో రాజకీయ జోక్యం తగదు

సత్తుపల్లి/చింతకాని: అర్హులందరికీ దళితబంధుతో పాటుగా గృహలక్ష్మి, బీసీబంధు పథకాలను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావులు తెలిపారు. శనివారం సత్తుపల్లిలో, చింతకానిలోని పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పథకాలు కావాలంటే గులాబీ కండువాలు కప్పుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారని.. అలాంటప్పుడు ఈ పథకానికి గులాబీ స్కీం అని పెట్టుకో పోయారా అంటూ ఎద్దేవా చేశారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వానికి ఊసేలేదని విమర్శించారు. ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ సమావేశాలల్లో జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మోరంపూడి పాండు, చలమాల విఠల్, ఎ.రామలింగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణరెడ్డి, తన్నీరు కృష్ణారావు, సర్వేశ్వరరావు, చంద్రశేఖర్, జగన్మోహన్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు జానికీరాములు, వెంకటనర్సయ్య, వీరబాబు, చినవీరయ్య, రమణ, గోపయ్య, యజ్ఞనారాయణ, రవి పాల్గొన్నారు.



సత్తుపల్లి: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చీరలు తగలబెట్టిన మహిళలు

కొణిజర్ల: కాంగ్రెస్ నాయకులు ఇస్తున్న చీరలు వద్దు.. కేసీఆర్ పంపిన బతుకమ్మ చీరలే ముద్దు అంటూ కొందరు మహిళలు మండలంలోని తనికెళ్లలో చీరలను దహనం చేశారు. కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ బాలాజీనాయక్ సోనియమ్మ సారె పేరుతో మండలంలోని పలు గ్రామాల మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి చీరలను రోడ్డుపై పెట్రోలు పోసి నిప్పంటించిన వారు సర్పంచ్ చల్లా మోహనరావుకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఇదే విషయమై శనివారం కొణిజర్లలో పీసీసీ సభ్యుడు వడ్డె నారాయణరావు మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ ఓర్వలేక కొందరు మహిళలను రెచ్చగొట్టి చీరలను తగులబెట్టించారని ఆరోపించారు. తమ పార్టీ నేత బాలాజీనాయక్ ఇస్తున్న చీరలు ఇష్టం లేకపోతే తిరస్కరించాలే తప్ప తగలబెట్టడం సరికాదని పేర్కొన్నారు.



చీరలను తగలబెడుతున్న మహిళలు, యువకులు

రుణమాఫీ పూర్తి చేయాలి

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ వెంటనే పూర్తి చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రెబ్బవరం గ్రామీణ వికాస్ బ్యాంకు ఎదుట శనివారం నిరసన చేపట్టారు. అనంతరం బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, కురుకుంట్ల శ్రీనివాసరావు, అమరనేని వెంకటేశ్వరరావు, వెంపటి రాజా, వేణు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ మమత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ అంకిరెడ్డి అనూస్‌రెడ్డి ప్రారంభించారు. వీఎల్ఓ శ్రీనివాస్, జేవీఓ రాధాకృష్ణ, వీఏ రామకృష్ణ, నయీమ్ పాషా, శ్రీనివాస్, మోసిన్, విజయకుమార్, హనుమంతు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో, నృత్యాలు, డ్యాన్స్‌లతో అలరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు మురళీధర్‌రెడ్డి, అరవింద్‌బాబు, సోమి రెడ్డి, నతీష్ చంద్ర, రత్నాకర్, దుర్గ, కాశారావు, భాస్కర్‌రావు, శేషగిరిరావు, నాగేశ్వరరావు, ప్రమీల, జ్యోతి, పూజిత, సీత, శ్రీనివాస్ గురువయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైరాకు చెందిన భూక్యా బుజ్జికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, శ్రీకాంత్,, రామకృష్ణ, మహాలక్ష్మి, గోపి పాల్గొన్నారు.

శంకుస్థాపన

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో రూ.9 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి సర్పంచ్ వాకదాని కన్నయ్య శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మైసయ్య, మాజీ సర్పంచ్ ఎండీ అజ్గర్, నాయకులు వీరబాబు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని రైతుల రాస్తారోకో

వైరారూరల్: వైరా రిజర్వాయర్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించాలని కోరుతూ.. పాలడుగు, బోనకల్ మండలంలోని రాపల్లే రైతులు శనివారం పాలడుగు గ్రామం వద్ద వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారబంధీ విధానంతో ఆయకట్టు చివరిలోని తమ పంట పొలాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. రిజర్వాయర్ కుడి, ఎడమ కాలులలో పలు రకాల చెట్లు, వ్యర్థాలు పేరుకుపోయాయన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై మేడా ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో రైతుల ఆందోళన విరమించారు. దాని తర్వాత నీటి పారుదల శాఖ డీఈ శ్రీనివాస్ కుడి కాల్వపై పర్యటిస్తున్న విషయం తెలుసుకున్న బొంతు రాంబాబు రైతు సంఘం బాధ్యులతో కలిసి వెళ్లి చివరి భూముల పరిస్థితిని వివరించారు. ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.



రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు